సాక్షి
కామారెడ్డి
శుక్రవారం । 10 । ఫిబ్రవరి । 2023



దాహం తీరేదెలా?
సాసర్ పిట్లలో నీరు నింపడం లేదు. దీంతో వన్యప్రాణులు దాహం తీర్చుకోవడానికి పొలాల వద్దకు వస్తున్నాయి.
- 9లో ▸



సీటీ స్కాన్‌కు ప్రైవేటుకే..
జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మూడు నెలలుగా సీటీ స్కాన్ యంత్రం పనిచేయడం లేదు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.5 /11.5

వాతావరణం
పొగమంచు కురుస్తుంది. ఉదయం చలి గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మాతు సంగెం బడిని సందర్శించిన డీఈవో



సాక్షి, కామారెడ్డి: కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల మేరకు డీఈవో రాజు గురువారం మాతుసంగం పాఠశాలను సందర్శించారు. గ్రామస్తులు బడికి బాసటగా నిలిచి సౌకర్యాలు కల్పించిన విషయంపై గురువారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిని చదివిన కలెక్టర్.. బడిలో ఇంకా ఎలాంటి సౌకర్యాలు అవసరమన్న విషయం తెలుసుకోవడానికి డీఈవోను పంపించారు. తానూ త్వరలోనే బడిని సందర్శిస్తానని కలెక్టర్ 'సాక్షి'తో తెలిపారు.

'షూటింగ్'కు అనువైన ప్రాంతంగా కామారెడ్డి కళాశాల

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలను చలన చిత్రాల చిత్రీకరణకు అనువైన ప్రాంతంగా రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ గుర్తించింది. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ కిష్టయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి కళాశాల భారీ భవనం, విశాలమైన ప్రాంగణం, రాశివనం, క్రీడా ప్రాంగణం, వాననీటి సంరక్షణ, కొలనులు షూటింగ్‌కు అనువుగా ఉన్నట్టు గుర్తించారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

నేడు జాబ్ మేళా

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శుక్రవారం ఉదయం జాబ్ మేళా నిర్వహించనున్నారు. బహుళజాతి కంపెనీ అయిన జెన్‌పాక్ట్‌లో ఉద్యోగాల భర్తీకి ఈ మేళా నిర్వహిస్తున్నారని కళాశాల ప్రిన్సిపాల్ కిష్టయ్య ఓ ప్రకటనలో తెలిపారు. 2022, 2023 సంవత్సరాల్లో డిగ్రీ, బీటెక్ పూర్తిచేసిన వారు ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొనాలని సూచించారు.

5,739 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో గురువారం కంటి వెలుగు కార్యక్రమంలో 5,739 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 775 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 71,213 మందికి కంటి పరీక్షలు చేసి 13,283 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశామని అధికారులు తెలిపారు.

'శ్రద్ధతో సన్నద్ధం కావాలి'



కామారెడ్డి టౌన్: విద్యార్థులు పోటీ పరీక్షలకు శ్రద్ధతో సన్నద్ధం కావాలని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం సూచించారు. గురువారం సాందీపని జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జేఈఈలో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులను సన్మానించారు. జేఈఈలో 97.37 శాతం మార్కులు సాధించిన ఏ.అపర్ణతో పాటు, అడ్వాన్స్‌కు అర్హత సాధించిన రాహుల్, సానియా బేగం, సైదా, ఫాతిమా, అంకిత, వైష్ణవి, శ్రుతి, బాల సరస్వతిలను సన్మానించారు. కార్యక్రమంలో సాందీపని విద్యాసంస్థల ప్రతినిధులు హరిస్మరణ్‌రెడ్డి, అశోక్‌రావు, పెంటయ్య, జనార్దన్‌రెడ్డి, కృష్ణమూర్తి, దేవేందర్‌రావు, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

'రుణ మంజూరు లక్ష్యాన్ని చేరుకోవాలి'



కామారెడ్డి క్రైం: రుణాల మంజూరు లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ బ్యాంకర్లకు సూచించారు. జిల్లాలో వార్షిక రుణ మంజూరు లక్ష్యం రూ. 4,700 కోట్లు కాగా.. ఇప్పటివరకు రూ. 3,023 కోట్లు (64.32 శాతం) ఇచ్చామన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రుణాల వితరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పంట రుణాల వితరణ లక్ష్యం ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదన్నారు. పారిశ్రామిక, ఎస్సీ, ఎస్టీ, బీసీ శాఖలకు సంబంధించిన పెండింగ్ రుణాలను తక్షణమే అందించాలన్నారు. సదాశివనగర్, లింగంపేట మండల సమాఖ్యలకు మంజూరైన చేపల పెంపకం యూనిట్ల రాయితీ పత్రాలను అందించారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ శ్రీనివాసరావు, ఆర్‌బీఐ అధికారి అలీబాబా, నాబార్డ్ డీడీఎం నగేష్, ఎల్డీఎం చిందం రమేష్, డీఆర్‌డీవో సాయన్న, జిల్లా వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల అధికారులు భాగ్యలక్ష్మి, భరత్, మెప్మా పీడీ శ్రీధర్‌రెడ్డి, డీపీఎంలు పాల్గొన్నారు.

కరెంటు కష్టాలు



బొమ్మన్‌దేవ్‌పల్లిలో విద్యుత్ కోతలతో నీరందక తడారిన వరి పైరు

- ఇష్టానుసారంగా కోతలు
- తడారుతున్న భూములు
- రాత్రిపూట విద్యుత్ సరఫరాతో ఇబ్బందిపడుతున్న రైతులు

రైతాంగానికి అప్పుడే విద్యుత్ కష్టాలు పెరిగాయి. కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా రాత్రి పూట విద్యుత్ సరఫరా చేస్తుండడంతో పొలాల వద్దే జాగారం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే రకరకాల తెగుళ్ల వ్యాపించి వరి పైరు ఎదగడం లేదని ఆందోళన చెందుతున్న రైతులు.. కరెంటు కోతలతో పంట మరింత దెబ్బతింటోందని ఆవేదన చెందుతున్నారు.

సాక్షి, కామారెడ్డి : వర్షాకాలంలో భారీ వర్షాలు కురియడంతో భూగర్భజలాలు గణనీయంగా వృద్ధి చెందాయి. దీంతో రైతాంగం యాసంగి సాగుపై ఆశలు పెంచుకుంది. ముఖ్యంగా బోర్లు, బావుల వద్ద వరి సాగుకు ప్రాధాన్యతనిచ్చారు. దీంతో యాసంగిలో 2.30 లక్షల ఎకరాల్లో వరి సాగైంది.

జిల్లాలో లక్షా 5 వేల బోర్లు, బావులు ఉన్నాయి. వ్యవసాయ కనెక్షన్లతో పాటు ఇతర అన్ని రకాల వినియోగానికి కలిపి రోజూ జిల్లాలో 4.1 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగమవుతోంది. పది రోజులుగా జిల్లాలో కరెంటు కోతలు పెరిగాయి. కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితుల్లో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. సరఫరా అవుతున్న పది గంటలైనా నిరంతరాయంగా ఇస్తే ఇబ్బందులు ఉండేవి కాదు. కానీ మూడు నాలుగు విడతల్లో ఇస్తుండడంతో పారిన మడే మళ్లీ పారుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు కరెంటు సరఫరా వేళల గురించి సబ్‌స్టేషన్లలో పనిచేసే ఆపరేటర్లు, గ్రామాల్లో పనిచేసే లైన్‌మన్లకు సమాచారం అందిస్తున్నారు. విద్యుత్ సిబ్బంది వాట్సాప్ గ్రూపుల ద్వారా రైతులకు సమాచారం చేరవేస్తున్నారు. అయితే కరెంటు వచ్చినా ఎంతసేపు ఉంటుందన్న గ్యారంటీ లేకపోవడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు.

పొలానికి వెళ్లాలంటేనే జంకు..

వ్యవసాయానికి పగటిపూట కాకుండా రాత్రి పూట విద్యుత్ సరఫరా చేస్తుండడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు. రాత్రి పన్నెండు గంటలు, ఒంటి గంటకు కూడా కరెంటు వస్తోంది. ఆ రాత్రి వేళ రైతులు పొలం వద్దకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. రాత్రి పూట కరంటు భయంతో పాటు వన్య ప్రాణులు, విషపు పురుగుల భయం కూడా రైతులను వెన్నాడుతోంది.

నీరందడం లేదు..



కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియడం లేదు. దీంతో పారిన మడే మళ్లీ పారుతోంది. పొలం దగ్గరకు వెళ్లి కరంటు ఎప్పుడు వస్తుందోనని ఎదురుచూడాల్సి వస్తోంది. కోతలు ఎత్తివేయాలి.
–ఇక్కల సాయిలు, రైతు, శెట్పల్లి సంగారెడ్డి

పంట దెబ్బతింటోంది..



పన్నెండు ఎకరాల్లో వరి పంట సాగు చేసిన. కరెంటు కష్టాలతో పంట ఎండిపోతోంది. కరెంటు సరఫరా మెరుగుపడకుంటే పంట మొత్తం పాడయ్యే పరిస్థితి ఉంది. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలి.
– సదానందగౌడ్, రైతు, బొమ్మన్‌దేవ్‌పల్లి

పెద్దగా సమస్య లేదు



అవసరానికి అనుగుణంగా కరెంటు సరఫరా చేస్తున్నాం. జిల్లాలో పెద్దగా ప్రాబ్లం లేదు. ఈ మధ్య చిన్నచిన్న సమస్యలు ఎదురయ్యాయి. వాటిని సరి చేశాం. పంటలకు అవసరానికి అనుగుణంగా విద్యుత్ ఇస్తున్నాం.
–రమేశ్‌బాబు, ఎస్‌ఈ, ట్రాన్స్‌కో

సబ్‌స్టేషన్ ముట్టడి

మాచారెడ్డి: విద్యుత్ కోతలతో రైతులు ఆందోళనబాట పడుతున్నారు. అప్రకటిత కరెంట్ కోతలకు నిరసనగా గురువారం చుక్కాపూర్ గ్రామానికి చెందిన రైతులు ఆందోళనకు దిగారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించి, ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అర్ధరాత్రి ఒంటిగంటకు, రాత్రి రెండుమూడు గంటలకూ విద్యుత్ సరఫరా చేస్తున్నారన్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియడం లేదని, దీంతో పొలాల వద్ద జాగారం చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు 7 నుంచి 8 గంటల పాటు కరెంట్ సరఫరా చేస్తున్నప్పటికీ నిరాటంకంగా ఇవ్వకపోవడంతో నీరందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై సంతోష్‌కుమార్ సబ్‌స్టేషన్‌కు చేరుకుని రైతులను సముదాయించారు. ట్రాన్స్‌కో ఏఈ వెంకటరమణాచారితో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యను వివరించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న రైతులు

గుర్తు తెలియని వాహనం ఢీకొని చిరుత మృతి

ఇందల్వాయి: చంద్రాయన్‌పల్లి అటవీ ప్రాంతంలో 44వ నంబరు జాతీయ రహదారిపై బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మూడేళ్ల వయస్సు గల ఆడ చిరుత మృతి చెందింది. ఎఫ్‌డీవో రామ్‌కిషన్, ఎఫ్ఆర్వో హిమ చందన తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రాయన్‌పల్లి అటవీ ప్రాంతంలో జాతీయ రహదారిపై చిరుత పడిపోయి ఉండడాన్ని గమనించిన స్థానికులు అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించారు. అటవీ సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి చూడగా చిరుత మృతి చెందినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా అటవీ అధికారులు మాట్లాడుతూ చిరుతలు నూతన ఆవాసాల ఏర్పాటు, ఆహారం, నీటి అన్వేషణలో భాగంగా తరచూ తమ ఆవాసాలను వదిలి వేరే ప్రాంతాలకు వెళ్తాయని ఆ క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. గతంలో కూడా ఈ ప్రాంతంలోనే మగ చిరుత ప్రమాదానికి గురై చనిపోయినట్లు వారు తెలిపారు. మృతిచెందిన చిరుతను తిర్మన్‌పల్లి ఫారెస్ట్ సెంట్రల్ నర్సరీకి తరలించి పశువైద్యుడు గంగాప్రసాద్ ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించి దహనం చేసినట్లు తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిరుత

నెలాఖరులో జిల్లా స్పోర్ట్స్ మీట్

కామారెడ్డి అర్బన్: జిల్లాలో స్పోర్ట్స్ మీట్ నిర్వహించేందుకు కలెక్టర్ జితేష్ వి పాటిల్ సానుకూలంగా స్పందించారని ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు తెలిపారు. ఉద్యోగుల జేఏసీ చైర్మన్ నరాల వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ దేవేందర్ తదితరులు గురువారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల చివరి వారంలో స్పోర్ట్స్ మీట్ నిర్వహించడానికి కలెక్టర్ అంగీకరించారన్నారు. క్రీడల నిర్వహణ ఆర్థికంగా భారం కాకుండా తాము కూడా కొంత మొత్తాన్ని భరిస్తామని పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉద్యోగ జేఏసీ నాయకులు బి.సాయిరెడ్డి, బి.సాయిలు, ఎస్.భూమయ్య, దేవరాజు, లక్ష్మణ్, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఉద్యోగుల జేఏసీ నాయకులు

కొనసాగుతున్న నిరసనలు



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

కామారెడ్డి టౌన్: ప్రభుత్వం నుంచి జిల్లాలోని డ్వాక్రా సంఘాల సభ్యులకు రావాల్సిన రూ. 52 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మహిళలు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌కు ర్యాలీగా తరలివెళ్లారు. పోలీసులు అడ్డుకోవడంతో అక్కడే ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులతో వాగ్వాదం జరిగింది. కలెక్టర్ బయటికి వచ్చి వినతిపత్రం తీసుకోవాలని, లేదంటే కలెక్టరేట్ లోపలికి వెళ్లడానికి పదిమందికి అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లోపలికి వెళ్లిన 10 మంది మహిళలను జేసీ చాంబర్ వద్ద అడ్డుకుని ముగ్గురికి మాత్రమే అనుమతి ఇచ్చారు. దీంతో మహిళలు వెనుదిరిగారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వినతి పత్రం తీసుకోవడానికి కలెక్టర్ ముఖం చాటేయడం బాధాకరమన్నారు. త్వరలో డ్వాక్రా మహిళలందరం కలిసి కన్నీళ్లతో కలెక్టర్ కాళ్లు కడుతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళనలో బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'నిధులపై స్పష్టత ఇవ్వాలి'

కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా సంఘాల సభ్యుల కోసం ఇటీవల బడ్జెట్‌లో కేటాయించిన రూ. 1,500 కోట్లపై స్పష్టత ఇవ్వాలని బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధులను పాత బకాయిల చెల్లింపులకు వినియోగిస్తారా లేక కొత్త రుణాలకే కేటాయిస్తారా అన్న విషయం చెప్పాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 6,500 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని, వాటిని ఎలా విడుదల చేస్తారని, కొత్త రుణాలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. రాష్ట్రంలో గతంలో 92 లక్షల మంది డ్వాక్రా సంఘాల సభ్యులు ఉండేవారని, ప్రభుత్వంపై నమ్మకంలేక ఇందులో 29 లక్షల మంది తప్పుకున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ డ్వాక్రా సంఘాల మహిళలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలకు సంబంధించిన పథకాలన్నీ ఎత్తివేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. పావలా వడ్డీ రాయితీ, అభయహస్తం బకాయిలు చెల్లించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని, తాను నిరవధిక నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు. మహిళలు కడుపు రగలి ఆందోళన చేస్తుంటే శివాయిపల్లి సర్పంచ్ విఠల్‌రెడ్డి నోటికొచ్చినట్లు మాట్లాడడం సరికాదన్నారు. మళ్లీ దురుసుగా ప్రవర్తిస్తే నియోజకవర్గంలోని మహిళలందరితో కలిసి సర్పంచ్ ఇంటి ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

క్లుప్తంగా

కోటగిరి 'సాక్షి' విలేకరి మృతి


గంగాధర్(ఫైల్)

వర్ని: సీనియర్ పాత్రికేయుడు, కోటగిరి మండల 'సాక్షి' పార్ట్ టైం విలేకరి గంగాధర్(52) గురువారం ఉదయం తన నివాసంలో గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన 30 ఏళ్లుగా వివిధ పత్రికల్లో పనిచేశారు. గంగాధర్ మృతిపై జర్నలిస్టు సంఘాలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సంతాపం వ్యక్తం చేశారు. అలాగే స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ భాస్కర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సురేందర్‌రెడ్డి, బీజేపీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి మాల్యాద్రి రెడ్డి, కాంగ్రెస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాలరాజు, రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఎలమంచిలి శ్రీనివాసరావు, యూత్ కాంగ్రెస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి కూనిపూర్ రాజిరెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నన్నేసాబ్‌లు సంతాపం తెలిపారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక



మాక్లూర్: జాతీయ స్థాయి పరుగు పందెం పోటీలకు మండలంలోని కేజీబీవీకి చెందిన విద్యార్థి జి నిఖిత ఎంపికైనట్టు పాఠశాల ప్రత్యేక అధికారిణి ప్రగతి గురువారం తెలిపారు. ఈ నెల 11, 12, 13 తేదీల్లో బీహార్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో నిఖిత పాల్గొననున్నట్లు చెప్పారు. జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

సీఆర్పీఎఫ్ జవాన్ విగ్రహం ధ్వంసం



తాడ్వాయి: మండలంలోని చిట్యాలలో ఏర్పాటు చేసిన సీఆర్పీఎఫ్ జవాన్ కంది సిద్దిరాములు విగ్రహాన్ని బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గ్రామానికి చెందిన సిద్దిరాములు 1997లో విధి నిర్వహణలో అసోంలో మృతి చెందాడు. సిద్దిరాముల తల్లి నాగవ్వ తన పింఛన్ డబ్బులను పోగు చేసుకొని విగ్రహాన్ని తయారు చేయించింది. గ్రామస్తుల సహకారంతో ప్రధానకూడలీ గద్దెపై విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నాలుగు రోజుల అనంతరం విగ్రహ ఆవిష్కరణ చేపట్టాలని నిర్ణయించారు. ఇంతలో గ్రామానికి చెందిన కొందరు ఈ విగ్రహాన్ని గద్దె నుంచి కింద పడేశారు. సిద్దిరాములు తమ్ముడు కంది విఠల్ పోలీసు స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేయగా పోలీసులు మేడం బాలయ్య, సంగెం మురళి, లాండే రమేష్, ఏటి మల్లేష్ విగ్రహాన్ని ధ్వంసం చేసినట్లు గుర్తించారు.

క్రీడా దుస్తుల ఆవిష్కరణ



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్(భిక్కనూర్)కు చెందిన క్రీడాకారులు రూపొందించిన దుస్తులను గురువారం వీసీ రవీందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. సౌత్‌క్యాంపస్‌లో వివిధ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులందరూ ఒకే విధమైన డ్రెస్‌కోడ్ పాటించాలని ఈ దుస్తులు రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డైరెక్టర్ టి.సంపత్, సౌత్‌క్యాంపస్ స్పోర్ట్స్ ఇన్‌చార్జి సుధాకర్‌గౌడ్, పీడీ బీఆర్‌నేత, అసిస్టెంట్ పీడీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సీటీ స్కాన్‌కు ప్రైవేటుకే..

- జీజీహెచ్‌లో మూడు నెలలుగా పనిచేయని యంత్రం
- బయట సెంటర్లకు పంపుతున్న సిబ్బంది
- రోగులపై ఆర్థికభారం


పని చేయని స్కానింగ్ మిషన్



మిషన్ పనిచేయటం లేదని పెట్టిన బోర్డు

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో అతి ముఖ్యమైన సిటీ స్కానింగ్ మిషన్ మూడు నెలలుగా పనిచేయటం లేదు. కొట్లాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వం కొనుగోలు చేసిన స్కానింగ్ మిషన్ పనిచేయకపోవటంతో స్కానింగ్‌కు వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోంది. జిల్లాతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల ప్రజల వైద్యానికి జీజీహెచ్ పెద్దదిక్కుగా ఉంది. మిషన్ పనిచేయకపోవటంతో రోగులు ప్రయివేట్ స్కానింగ్ సెంటర్లలో స్కానింగ్ తీయించుకుంటున్నారు. జిల్లాలోనే అతిపెద్దదైన ఆస్పత్రిలో స్కానింగ్ మిషన్ చెడిపోతే వెంటనే మరమ్మతులు చేయించాల్సిన అధికారులు దీనిగురించి పట్టించుకోవటంలేదు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ స్కానింగ్ మిషన్ విషయంలో నవంబర్ నెల నుంచి సంబంధిత పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నప్పటికి ఫలితం లేకుండా పోతోంది. దాంతో న్యూరోకు సంబంధించి రోగులు స్కానింగ్ కొరకు ప్రయివేట్ స్కానింగ్ సెంటర్లకు వెళ్లి పరీక్షలు చేయించుకోవల్సి వస్తోంది.

మెయింటెనెన్స్ చార్జీల బకాయిలు

ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సిమాన్స్ కంపనీకి చెందిన స్కానింగ్ మిషన్ నిర్వహణకు ప్రతి నెలా మెయింటెనెన్స్ చార్జీల కింద ప్రభుత్వం దాదాపు రూ.లక్షల్లో చెల్లించాల్సి ఉంటుంది. స్కానింగ్ మిషన్ నిర్వహణ, మరమ్మతుల బకాయిలు రూ.1.27కోట్లు ఉన్నాయి. ఈ బకాయి డబ్బులు చెల్లిస్తేగాని ఆ కంపెనీ వారు మిషన్‌ను బాగుచేసే పరిస్థితి లేదు. ఇటీవల ప్రభుత్వ ఆస్పత్రిలో ముఖ్యమైన ఆపరేషన్లు విజయవంతం కావటంతో ప్రజలకు ప్రభుత్వ వైద్యులపై నమ్మకం కలుగుతోంది. దాంతో రోజు రోజుకు రోగుల సంఖ్య పెరుగుతోంది. సీటీ స్కానింగ్ మిషన్‌కు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తేవాలని రోగులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

ప్రభుత్వ ఆస్పత్రిలో గల స్కానింగ్ మిషన్ తరచు పాడవుతోంది. దీని స్థానంలో కొత్త స్కానింగ్ మిషన్ పంపాలని నవంబర్ నుంచి వైద్యశాఖకు లేఖలు రాస్తున్నాం. మూడు నెలాల తర్వాత ఈ విషయం కొలిక్కి వచ్చింది. కొత్త మిషన్ ఇచ్చేందుకు అధికారులు అంగీకారం తెలిపారు. మరో రెండు నెలాల్లో ఆస్పత్రికి కొత్త స్కానింగ్ మిషన్ రాబోతుంది.

– ప్రతిమారాజ్, ఆస్పత్రి సూపరింటెండెంట్

రక్తదానం మహోన్నతమైంది


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్


కామారెడ్డి క్రైం: సమాజసేవలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావడం అభినందనీయమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డిలోని పీఆర్‌టీయూ భవనంలో పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని సూచించారు. అన్ని దానాల కన్న రక్తదానం మహోన్నతమైనదని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 13 గ్రామాల ఉపాధ్యాయులకు హెచ్ఆర్ఏ ఇప్పించడంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ కృషి చేశారని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు దామోదర్ రెడ్డి కొనియాడారు. జిల్లాలో 50 మంది ఉపాధ్యాయులకు రెడ్ క్రాస్ జీవిత సభ్యత్వం ఇప్పిస్తామన్నారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు జూనియర్ రెడ్ క్రాస్ సభ్యత్వం ఇప్పించాలని జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ రాజన్న కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రక్తదానం చేశారు. పీఆర్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి కుశాల్, రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి రఘు కుమార్, రమేష్ రెడ్డి, జమీల్ అహ్మద్, శ్రీనివాస్ రెడ్డి, గోవర్ధన్, పోచయ్య, గాదరి రాజిరెడ్డి, ఈశ్వర్ కుమార్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం


ధర్మారం(బి)లో ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి, నగేష్‌రెడ్డి

డిచ్‌పల్లి: రాబోయే ఎన్నికల్లో అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ విజయం ఖాయమని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ భూపతిరెడ్డి, టీపీసీసీ ప్రధానకార్యదర్శి కే నగేష్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల్లో పాదయాత్ర చేశారు. ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సందేశాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని విమర్శించారు. 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నామని బీఆర్ఎస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందని, క్షేత్ర స్థాయిలో 6 గంటలు కూడా విద్యుత్ రావడం లేదన్నారు. పంటలు ఎండిపోతున్నాయని రైతులు నిరసనలు చేస్తుంటే కళ్లు కన్పించడం లేదా అని ప్రశ్నించారు. 8 ఏళ్లలో రూరల్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. ముప్ప గంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, అమృతాపూర్ గంగాధర్, పాలసాని శ్రీనివాస్, వాసుబాబు, శ్యాంసన్, ధర్మాగౌడ్, మురళి, రాజేశ్వర్, ఇబ్రహీం, సాయారెడ్డి, మల్కయ్య పాల్గొన్నారు.

చిలుకలు వాలే చెట్టయ్యింది



కామారెడ్డి రైల్వే స్టేషన్ ఎదుట ఉన్న వేప చెట్టు రాత్రి కాగానే రామచిలుకలతో కనువిందు చేస్తుంది. చాలా ఏళ్లుగా ఈ వేప చెట్టుపై వేలాది సంఖ్యలో రామచిలుకలు ఉంటున్నాయి. రాత్రి వేళ ఈ రామచిలుకలు ఎగరడం, మళ్లీ చెట్టుపై వాలడం, కొమ్మ కొమ్మకు ఆకుల్లాగా కనిపిస్తున్నాయి.

– కామారెడ్డి టౌన్

'కాంగ్రెస్‌లో చేయి కలిపేవారు లేరు'



కామారెడ్డిటౌన్: కాంగ్రెస్ పార్టీలో చేయి చేయి కలిపే వారు లేరని ఇటీవల వైఎస్సార్ తెలంగాణ పార్టీలో చేరిన జమునారాథోడ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేసే వారికి, అందులో మహిళలకు గుర్తింపు లేదన్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో గ్రూపు రాజకీయాలు, పెత్తనాలు కొనసాగుతున్నాయన్నారు. కాంగ్రెస్ జీరో స్థాయిలో ఉన్న సమయంలో వైఎస్ రాజశేఖరరెడ్డి పాదయాత్రతో జీవం పోశారని ఆయన ఆశయాల కోసం వైఎస్సార్‌టీపీలో చేరానని చెప్పారు. టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి నియామకం అయ్యాక ఎవరిని లెక్కలోకి తీసుకోవడం లేదన్నారు. 14 ఏళ్లుగా కాంగ్రెస్‌లో తనను ఎంతగా అవమానించినా ఓపిక పట్టానని తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో వైఎస్సార్ టీపీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. నాయకులు నీలం రమేష్, నీలం సుధాకర్, మహ్మద్ తాహెర్, డాక్టర్ వెంకట్ ఉన్నారు.

'స్పౌజ్ పాయింట్లు వాడిన వారి వివరాలు బయటపెట్టాలి'

నిజామాబాద్ అర్బన్: ఉపాధ్యాయ బదిలీల్లో స్పౌజ్ పాయింట్లు వాడుకున్న టీచర్ల వివరాలను బయట పెట్టాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగర్ల సురేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో పాయింట్లు వాడుకొని ప్రస్తుతం కూడా కొందరు మళ్లీ వినియోగించుకున్నారని ఈ వివరాలు బయట పెట్టాలన్నారు. 2017, 2018లో స్పౌజ్ పాయింట్లు వాడుకున్న ఉపాధ్యాయులను పరిశీలించాలన్నారు. గతంలో స్పౌజ్ పాయింట్ వినియోగించుకొని సర్వీస్ బుక్కులో స్టాంపు వేయలేదన్నారు. దీంతో అవే పాయింట్లు వాడుకుంటున్నారన్నారు. పారదర్శకంగా బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన కంటెయినర్

- ఒకరి మృతి, మరో ఇద్దరికి గాయాలు

సదాశివనగర్: మండలంలోని దగ్గి అటవీ శివారు జాతీయ రహదారిపై బుధవారం ట్రాక్టర్‌ను కంటెయినర్ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలు కాగా ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు. ఇందల్‌వాయి టోల్‌ప్లాజకు చెందిన కూలీలు ధర్పల్లి కిషన్(53), గణపురం భూమయ్య, బాదావత్ రవీందర్ పనులు ముగించుకొని ట్రాక్టర్‌లో ఇందల్‌వాయి వైపు వెళ్తున్నారు. అదే సమయంలో నిజామాబాద్ వైపు వెళ్తున్న కంటెయినర్ ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన కూలీలను నిజామాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ధర్పల్లి కిషన్ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. గణపురం భూమయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కిషన్ భార్య జయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. కిషన్ టోల్‌ప్లాజలో ఐదేళ్ల నుంచి చేస్తున్నాడని పేర్కొన్నారు. కంటైనర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

క్రైం కార్నర్

అనుమానంతో భార్యను చంపిన భర్త


సవిత మృతదేహం

నిజామాబాద్ సిటీ: అనుమానంతో కట్టుకున్న భార్యను అంతమొందించాడు ఓ భర్త. ఈ ఘటన నిజామాబాద్ రూరల్ మండలం భాగ్యనగర్(ఖానాపూర్)లో చోటు చేసుకుంది. రూరల్ సీఐ నరేష్ తెలిపిన వివరాలు.. భాగ్యనగర్‌కు చెందిన మారుతి నిజామాబాద్ గంజ్‌లో హమాలీ పని చేస్తుంటాడు. ఇతని భార్య గెలాండే సవిత(38) ఇంట్లోనే ఉంటూ అప్పుడప్పుడు కూలీ పనికి వెళ్తుంది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు కాగా పెద్ద కూతురికి వివాహం చేశారు. కాగా మారుతి పనికి సక్రమంగా వెళ్లకుండా మద్యానికి డబ్బుల కోసం భార్యను వేధిస్తూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో భార్యపై అనుమానం పెంచుకుని వేధించేవాడు. గురువారం మధ్యహ్నం ఈ విషయంలో భార్యను అనుమానిస్తూ ఆమెపై దాడి చేసి గొంతు నులిమి చంపాడు. అనంతరం అక్కడి నుంచి జారుకున్నాడు. అనంతరం సవిత ఇంటికి వచ్చిన బంధువు గమనించి చుట్టుపక్కల వారికి విషయం తెలిపింది. అనంతరం స్థానికులు విషయాన్ని పోలీసులకు తెలుపగా సీఐ నరేష్, ఎస్సై లింబాద్రి ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతురాలి తండ్రి లక్ష్మణ్ బాబురావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఎడపల్లి: మండలంలోని జానకంపేట గ్రామంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. సదరు మహిళకు మతిస్థిమితం లేదు. కొన్ని రోజులుగా గ్రామంలో భిక్షాటన చేస్తూ జీవిస్తోంది. ఈ క్రమంలో గురువారం రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు లారీ కింద పడింది. లారీ చక్రాలు ఆమె మీద నుంచి వెళ్లడంతో ఘటన స్థలంలోనే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని ప్రమాదానికి కారణమైన లారీని ఠాణాకు తరలించారు.

బోధన్‌లో యువకుడు..

బోధన్‌టౌన్: పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలోని బాలజీ స్వీట్‌హోంపై భవనంలో శక్కర్‌నగర్ కాలనీకి చెందిన షేక్ సల్మాన్(30) మృతి చెందాడు. బాలజీ స్వీట్‌హోం భవనంపై మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడిని శక్కర్‌నగర్ నివాసిగా గుర్తించి, హైదరాబాద్‌లో ఉంటున్న కుటంబ సభ్యులకు సమాచారం అందించారు. సల్మాన్ మద్యం తాగి తిరిగేవాడని స్థానికులు తెలిపారు. బుధవారం రాత్రి మద్యం తాగి ఈ ప్రాంతంలోనే తిరిగాడని, మద్యం మత్తులో కిందపడి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఈ విషయమై సీఐ బీడీ ప్రేమ్‌కుమార్‌ను సంప్రదించగా తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

చికిత్స పొందుతూ ఒకరు..


రాజు (ఫైల్)

ఎడపల్లి: మండలంలోని జానకంపేట సమీపంలో అశోక్ సాగర్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఎంఎస్‌సి ఫారం గ్రామానికి చెందిన అన్నారం రాజు(30) గురువారం మృతి చెందాడు. అన్నారం రాజు కారును ఓవర్‌టెక్ చేయబోయి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మరణించాడు.

అప్పు తీర్చడంలో సహకరించలేదని..

- భార్యతో కలిసి తల్లిని హత్య చేసిన కొడుకు


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

ఎల్లారెడ్డి: అప్పులు తీర్చడంలో సహకరించడం లేదని కొడుకు, కోడలు కలిసి మహిళను హతమార్చినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. ఎల్లారెడ్డి మున్సిపాలిటి పరిధిలోని గండిమాసానిపేట గ్రామానికి చెందిన లచ్చి సంజీవులు కూలీ పనులు చేసుకుంటు జీవనం గడిపేవాడు. చేసిన అప్పులు తీర్చేందుకు పొలం అమ్మాలని తల్లి లచ్చి పోచవ్వ (57)ను కోరగా ఆమె నిరాకరించింది. ఈ విషయమై 7న రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో తల్లి హతమార్చాలని నిర్ణయించుకుని 8వ తేది వేకువజామున భార్య సరితతో కలిసి పోచవ్వ మెడకు టవల్‌తో చుట్టి చంపేశాడు. గురువారం గ్రామ శివారులో సంచరిస్తున్న సంజీవులును పట్టుకుని విచారించగా తన భార్య సరితతో కలిసి తల్లిని హతమార్చానని ఒప్పుకున్నాడని డీఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై గణేష్ ఉన్నారు.

దొంగ కోసం పోలీసుల గాలింపు

- కార్మికుల బంధువుగా అనుమానం?
- నాలుగు గంటల పాటు బ్యాంక్‌లోనే దొంగ


సీసీ ఫుటేజీలో నమోదైన నిందితుడు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం ఖానాపూర్ గ్రామంలో మూడు రోజుల క్రితం జరిగిన బ్యాంక్ చోరీ యత్నం కేసులో దొంగ కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. బ్యాంక్‌లో చోరీ యత్నానికి పాల్పడిన దొంగ ఖానాపూర్ పరిసరాల ప్రాంతాలలో రైస్‌మిల్లుల్లో పనిచేస్తున్న హమాలీల ఇంటికి వచ్చిన బంధువుగా పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు హమాలీలను విచారించే పనిలో ఉన్నారు. కాగా బ్యాంక్‌లో చోరీకి యత్నించిన దొంగ ఆ రోజు రాత్రి 11 గంటల ప్రాంతంలోనే కిటికీ ఇనుప చువ్వను తొలగించి బ్యాంక్‌లోకి చొరబడినట్లు పోలీసులు సీసీ ఫుటేజీలో గమనించారు. 11 గంటల నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు బ్యాంక్‌లోనే ఉన్నాడు. మొదట ఏటీఎం ధ్వంసం చేసి అందులో డబ్బులు దొంగలించేందుకు యత్నించి విఫలమయ్యాడు. అనంతరం లాకర్ గది వద్దకు వచ్చాడు. లాకర్ గది ఇనుప డోర్ కంటే ముందు కట్టెతో తయారు చేసిన తలుపును పగలగొట్టాడు. అనంతరం లాకర్ డోర్‌ను తెరిచేందుకు యత్నించి విఫలమయ్యాడు. దీంతో పారిపోయాడు.

చెరువులో ఒకరి గల్లంతు!

డిచ్‌పల్లి: మండలంలోని మిట్టాపల్లి గ్రామానికి చెందిన నల్లవెల్లి మహిపాల్ గ్రామ శివారులోని చెరువులో గల్లంతైనట్లు గ్రామస్తులు తెలిపారు. గురువారం గ్రామంలోని ఒకరి ఇంట్లో శుభకార్యం జరిగింది. వారి ఇంటికి సంబంధించి బట్టలు ఉతికేందుకు మహిపాల్ తన భార్య, తల్లితో కలిసి చెరువు వద్దకు వెళ్లాడు. భార్య, తల్లి బట్టలు ఉతుకుతుండగా అప్పటికే కొద్దిగా కల్లు తాగిన మహిపాల్ స్నానం చేయడానికి చెరువులో దిగాడు. చెరువు నుంచి మహిపాల్ బయటకు రాకపోవడంతో భార్య, తల్లి ఆందోళనకు గురయ్యారు. గ్రామస్తులకు, పోలీసులకు తెలియడంతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడినా మహిపాల్ ఆచూకీ లభించకపోవడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు.

దాడి కేసులో ఇద్దరికి జైలు

సదాశివనగర్: మండలంలోని పద్మాజీవాడి శివారు అటవీ ప్రాంతంలో గత జూలైలో కామారెడ్డి పట్టణానికి చెందిన విభూతి సుభద్ర అనే వృద్ధురాలిపై దాడి చేసిన వారికి జైలు శిక్ష విధించింది. నిజామాబాద్‌కు చెందిన నీరడి అరుణ్‌కుమార్, కొండపల్లి సావిత్రి కలిసి కామారెడ్డిలో సుభద్రను బైక్‌పై ఎక్కించుకుని అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి ఒంటిపై ఉన్న రూ.మూడు లక్షల విలువైన బంగారు ఆభరణాలు దొంగిలించారు. ఈ విషయంలో అప్పట్లో వారిపై కేసు నమోదు అయింది. నిందితులకు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వెంకటేశ్ దుర్వా గురువారం మూడేళ్ల కఠిన కారాగార శిక్ష రూ.500 జరిమానా విధించినట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ అశోక్ శివరాం నాయక్, సీఐ రామన్, ఎస్సై రాజేశ్ ఈ కేసుపై ప్రత్యేక దృష్టి పెట్టినందుకు ఎస్పీ వారిని అభినందించారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో జైలు

భిక్కనూరు: మద్యం తాగి వాహనం నడిపిన ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు. ఎస్సై ఆనంద్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా లక్ష్మాపూర్‌కు చెందిన ఇరుకుల పోచయ్య మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. అయనను కామారెడ్డి సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా రెండు రోజుల జైలు శిక్ష విధించారన్నారు.

బైక్ ఢీకొని విద్యార్థికి గాయాలు

రామారెడ్డి: మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల వసతి గృహంలోని విద్యార్థిని ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. బుధవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో రోడ్డుపై వెళ్తున్న తొమ్మిదో తరగతి విద్యార్థి ధన్‌సింగ్‌ను బైక్ ఢీకొంది. విద్యార్థికి తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

నవీపేట: మండల కేంద్రంలోని రైల్వేగేట్ సమీపంలో బుధవారం రాత్రి రైలు కింద పడి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ తెలిపారు. నవీపేటకు చెందిన నర్సింహాచారి (53) ఆర్థిక ఇబ్బందులతో నర్సాపూర్ నుంచి నాగర్సోల్‌కు వెళ్తున్న రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.